
సిబ్బందిని తీసుకువెళ్లడానికి సిద్ధంగా ఉన్న బస్సులు


ఎన్నికల విధుల్లో పోలీసులు


దమాయపల్లిలో సామగ్రితో పోలింగ్ సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

- ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి తరలింపు
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు


దేవరకద్రలో 109వ ఆదర్శ పోలింగ్ స్టేషన్


దేవరకద్రలో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరుతున్న సిబ్బంది

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా అసెంబ్లీలో పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలో 274 కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి ఆయా పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన సిబ్బంది సామగ్రిని అందజేశారు. 70మంది సెక్టోరియల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వారీగా పీఓలకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లు, ఇతర సామగ్రి అప్పగించారు. ముందుగా సామగ్రి అందజేసి భోజన విరామం అనంతరం స్ట్రాంగ్‌రూం నుంచి ఈవీఎం, వీవీప్యాట్‌లను తీసుకొచ్చి అప్పగించారు. సామగ్రి జాబితా వారీగా సరిచూసుకున్న పీఓ, ఏపీఓ, ఓపీఓలు కేటాయించిన వాహనాల్లో కేంద్రాలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 6గంటలకు మాక్‌పోలింగ్ నిర్వహించి, తదుపరి 7గంటలనుంచి పోలింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 30రూట్లుగా విభజించారు. రూట్ ఆఫీసర్ల సారథ్యంలోనే 60 వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపించారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది 1,300, పోలీసులు 300మంది, రెవెన్యూ 300, మున్సిపల్ 150, మైక్రో అబ్జర్వర్లు 150, వెబ్‌కాస్టింగ్ సిబ్బంది 150, ఇతర సిబ్బంది, అధికారులు వెయ్యి మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు.

దేవరకద్ర నియోజకవర్గంలో..

దేవరకద్ర: నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లను చేశారు. మొత్తం ఓటర్లు 2,39,745 ఉండగా ఇందులో మహిళలు 1,21,130, పురుషులు 1,18,615 ఉన్నారు. నియోజకవర్గంలోని 8 మండలాలల్లో 289 పోలింగ్ స్టేషన్లు ఉండగా 1,445 మంది పీఓ, ఏపీఓలను నియమించారు. మొత్తం 32 రూట్లకు సంబంధించి అధికారుల బృందాలను నియమించారు. నియోజకవర్గంలో 5 మాడల్ పోలింగ్ స్టేషన్లు, 4 మహిళా పోలింగ్ స్టేషన్లు, ఒక యూత్ పోలింగ్ స్టేషన్, ఒక దివ్యాంగులకు ప్రత్యేకంగా పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సామాగ్రిని ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బందికి అందజేశారు.

పరిశీలించిన కలెక్టర్

సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎన్నికల అధికారి రవినాయక్, సాధారణ ఎన్నికల పరిశీలకుడు షెవాంగ్ గ్యాచో భూటియా, ఎస్పీ హర్షవర్ధన్ పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని పీఓలకు సూచించారు. రిజర్వ్‌లో ఉండే వారంతా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంపిణీ కార్యక్రమాన్ని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్ రావు పర్యవేక్షించారు.


మహబూబ్‌నగర్‌లో ఎన్నికల సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది

నవాబుపేట: ఎన్నికలకు సంబందించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో నవాబుపేట 28వ పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేక మహిళా పోలింగ్ కేంద్రంగా అలకరించి కొత్త మహిళ ఓటర్లకు స్వాగతం పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే తీగలపల్లిలో మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాట్లు చేశారు.

గట్టి బందోబస్తు

మహమ్మదాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగేందుకు ఆయా పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

చిన్నచింతకుంట: పార్ల మెంట్ ఎన్నికలకు మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీటివసతి, వృద్ధులకు, దివ్యాంగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేశామన్నారు. 36 పోలింగ్ కేంద్రాలకు 144మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోండి

కోయిల్‌కొండ: పార్లమెంట్ ఎన్నికలు ఆదివారం సాయంత్రం ఆయా పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సిబ్బంది ప్రత్యేక వాహనాలలో చేరుకున్నారు. మండలంలో 61 బూత్‌లకు గాను 8మంది సెక్టార్‌ఆఫీసర్‌లు, 250 మంది సిబ్బందిని కేటాయించినట్లు ఎంపీడీఓ కాళప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులు 150మందితో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్‌ఐ రాఘవేందర్ పేర్కొన్నారు.


జడ్చర్ల నుంచి పోలింగ్ కేంద్రానికి బస్సులో..


ఎన్నికల సామగ్రి తీసుకుని బస్సులో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది



ఆకర్షణీయంగా మహబూబ్‌నగర్ మోడల్ బేసిక్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రం


చిన్నచింతకుంట పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

క్లుప్తంగా

భూత్పూర్‌లో 38,078 మంది ఓటర్లు

భూత్పూర్: మండలంలోని 48 పోలింగ్ స్టేషన్లలో 38,078 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తహసీల్దార్ రాజు తెలిపారు . భూత్పూర్ మున్సిపాలిటీలోని 10 వార్డులకు గాను 11 పోలింగ్ స్టేషన్లు ఉండగా 11,680 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలోని 18 పంచాయతీలల్లో 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 26,398 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 254 మంది మరణించారని, 316 డబుల్ పేర్లు వచ్చాయని, 44 మంది ఇతర ప్రాంతాలకు మార్పిడి చేసుకున్నట్లు తహసీల్దార్ రాజు తెలిపారు.

ఉదయం 6 గంటలకు మాక్‌పోలింగ్

నవాబుపేట: అన్ని పోలింగ్ కేంద్రాల్లో సోమవారం గంట ముందు ఉదయం 6 గంటలకు మాక్ పోలింగ్ చేపట్టాలని తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు. మాక్ పోలింగ్ ద్వారా పీఓలు, ఏపీఓలు వీవీప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు సరిగా ఉన్నాయనే విషయాన్ని పోలింగ్ ఏజెంట్లకు, సిబ్బంది వివరించాల్సి ఉందని పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందని వివరించారు. వివిధ పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు గంట ముందు కేంద్రంలో ఉండాలని సూచించారు.

37 గ్రామాలకు 21 కేంద్రాలు

బాలానగర్: పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని 37 గ్రామాలకు 21 పోలింగ్ కేంద్రాలలో 39 బూత్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో మొత్తం 32,899 ఓటర్లు ఉండగా అందులో 16,556 పురుషులు, 16,242 మహిళా ఓటర్లు, ఒకరు ట్రాన్స్ జెండర్ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి



జడ్చర్ల: పట్టణ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో పలువురు బోధనలను వివరించారు. కార్యక్రమంలో చల్లా నరేంద్ర శర్మ, రాఘవేంద్ర శర్మ, రంజిత్‌బాబు, నరేంద్ర శర్మ, రమాకాంత్, దత్తుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

అడ్డాకుల: మండలంలోని గుడిబండకు చెందిన బాలిక(15) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పెంచలయ్య కుటుంబం 20 ఏళ్ల క్రితం అడ్డాకుల మండలం గుడిబండకు వచ్చి ఇటుక బట్టీలు నడుపుతూ జీవనం సాగిస్తోంది. వారి కుటుంబానికి చెందిన బాలిక ఈనెల 10న తెల్లవారుజామున ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

16 నుంచి ఆరాధన మహోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి 18 వరకు ఆరాధన గురుపూజ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ వడ్ల శేఖరాచారి, ప్రధాన కార్యదర్శి నారాయణ తెలిపారు. ఆదివారం దేవాలయం ప్రాంగణంలో ఆరాధన మహోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 16న స్వామివారి సుప్రభాతం నామ సంకీర్తన, ధ్వజారోహణం, పుణ్యాహవాచనం, కలశస్థాపన, గణపతిపూజ, రెండు రోజుల భజన పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 17న వీరబ్రహ్మేంద్రస్వామి, వేంకటేశ్వర స్వామి, శివలింగ ఆంజనేయస్వామివార్లకు అభిషేకం, విశేష పూజలు, హోమం, కుంకుమార్చన, భజనల పోటీలు, స్వామివారి రథోత్సవం ఊరేగింపు, 18న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములవారు, వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, ధార్మికోపన్యాసములు, భజనలతోపాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. స్వామివారి మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ, నర్సింహాచారి, సత్తయ్యాచారి, రమేష్, భీమాచారి, ఎస్.భాగన్నగౌడ్, లక్ష్మీ నారాయణ, సుధాకరాచారి, కృష్ణయ్యగౌడ్, సురేష్, దత్తాత్రేయచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్లు


మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో వేచిచూస్తున్న ప్రయాణికులు

స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్లటౌన్: ప్రయాణికులతో మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆదివారం కిక్కిరిసిపోయింది. ప్రజలు ఓట్లు వేయడానికి తమ స్వస్థలాలకు వెళ్లేందుకు తరలిరావడంతో సందడి నెలకొంది. ముఖ్యంగా నారాయణపేట, మద్దూర్ రూట్లో బస్సుల్లో సందడి కనిపించింది. ఈ రూట్లో వచ్చిన ప్రతి బస్సు ప్రయాణికులతో నిండుగా కనిపించాయి. అదే విధంగా హైదరాబాద్, తాండూర్, కొత్తకోట, పరిగి, నాగర్‌కర్నూల్, వనపర్తి రూట్లలో ప్రయాణికులు తరలివెళ్లారు. జడ్చర్ల బస్టాండ్‌లో ముఖ్యంగా నాగర్‌కర్నూలు, వనపర్తి, కొల్లాపూర్, కల్వకుర్తి వైపు వెళ్లే ముఖ్యకూడళ్ల మధ్యాహ్నం వరకు, తిరిగి సాయంత్రం రద్దీగా మారాయి. ఆర్టీసి బస్సులు కిటకిటలాడాయి.


జడ్చర్లలో తెల్లవారుజామున వేచి ఉన్న ప్రయాణికులు

ఘనంగా మదర్స్‌డే వేడుకలు


జిల్లా కేంద్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ బీఎస్ పరంజ్యోతి


చిన్నచింతకుంటలో వృద్ధులు దుస్తులు పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవుడు తన ప్రేమను మనపై తల్లిరూపంలో పంచుతున్నాడని హైదరాబాద్‌కు చెందిన సిస్టర్ బ్యూలా హెబర్ట్ అన్నారు. జిల్లా కేంద్రం హౌసింగ్‌బోర్డులోగల రెమా వర్షిప్ సెంటర్‌లో పాస్టర్ బీఎస్ పరంజ్యోతి ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ బ్యూలా హెబర్ట్ మాట్లాడుతూ పిల్లలు మంచి మార్గంలో పయనించేలా ప్రతి తల్లి కృషి చేయాలని కోరారు. ఈ లోకంలో కొంతమంది తల్లులు తమ బాధ్యతను మరిచి ప్రవర్తించడంతో వారి కుటుంబాలు, పిల్లలు అధ్వాన స్థితిలోకి వెళ్లిన ఘటనలు చాలా ఉన్నాయని తెలిపారు. తల్లి బాధ్యతాయుతమైన కుటుంబాన్ని చక్కబెట్టడంలో కీలకపాత్ర పోషించి, ఎంతో ఓపిక, సహనంతో రాణించి త్యాగశీలిగా ఉంటుందన్నారు. ప్రేమకు ప్రతిరూపమైన తల్లుల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రపంచవ్యాప్తంగా మదర్స్‌డే వేడుకలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. పాస్టర్ పరంజ్యోతి తల్లులకు బహుమతులు అందజేసి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం తల్లుల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవయ్య, లక్ష్మన్న, శ్యాంసుందర్, బ్లాం డీనా, ప్రెయిజీరాణి, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో అమ్మసేవా సమితి ఆధ్వర్యంలో మదర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రి స్టాఫ్ నర్స్ అనిత, మహిళలు లలితారెడ్డి, తులసి, జ్యోతి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు భక్తరాజు, బాలు, శేఖర్, వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లే కల్లాలు..

- పంట చేతికొచ్చినప్పుడల్లా అక్కడే నూర్పిళ్లు
- ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకునే వారు కరువైన వైనం


రాజాపూర్‌లో జాతీయ రహదారి వద్ద సర్వీస్‌రోడ్డులో ధాన్యం కుప్పలు

రాజాపూర్: మండల పరిధిలోని సర్వీస్‌రోడ్లు రైతులకు కల్లాలుగా మారుతున్నాయి. మండలకేంద్రంతో పాటు రంగారెడ్డిగూడ, ముదిరెడ్డిపల్లి, బాలానగర్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామాల వద్ద జాతీయ రహదారిపై ఉన్న ఈరోడ్లపై స్థానికరైతులు పంట నూర్పిళ్లు చేపడుతున్నారు. వరి, మొక్కజొన్న, జొన్న ఇలా ఏ పంట చేతికొచ్చినా వాటిపైనే ఆరోబోయడం వంటివి చేస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటు వాహనదారులే కాకుండా.. అటూ పంటల వద్ద కాపలాగా ఉన్న రైతులు సైతం ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఎన్నో ప్రతిసారి చోటు చేసుకుంటున్నాయి. గత సంవత్సరం ఇదే సమయంలో రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన పాలకొండ లక్ష్మమ్మ సర్వీస్‌రోడ్డుపై వరిధాన్యం ఆరబెడుతుండగా జాతీయ రహదారిపై ఓ కారు ఢీకొని వెళ్లడంతో లక్ష్మమ్మ అక్కడి కక్కడే మృతి చెందింది. ఇలా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయితే గతంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో కల్లాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. కాగా సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారనే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలోనే రైతులు కల్లాలను ఏర్పాటు చేసుకోలేకపోయారు. పొలాల వద్ద కల్లాలు ఉంటే రహదారులపై పంటలను నూర్పిళ్లు చేయడం కోసం రాకపోయేవారమని వారు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే రహదారులపై పంట నూర్పిళ్లు చేయకుండా వారికి మరింత అవగాహన కల్పించి.. ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని ఆయా గ్రామాల వారు అభిప్రాయపడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



సర్వీస్‌రోడ్లపై పంటలనూర్పిళ్లు చేస్తుండటంతో వాహనదారులు కళ్లముందే ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా నూర్పిళ్ల వల్ల ఇళ్లలోకి దుమ్ముధూళి రావడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు సైతం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సమస్యను ఎవరికి చెప్పాలో అర్థంకావడం లేదు.

– పవిత్ర, రాజాపూర్

తప్పనిసరి పరిస్థితుల్లోనే..



పొలాల వద్ద కల్లాలు ఏర్పాటు చేసుకోవాలని.. ప్రభుత్వం నుంచి అవకాశం ఉందని మాకు ఎవరూ చెప్పలేదు. కచ్చితమైన అవగాహన కల్పిస్తే మాలాంటి వారు రోడ్లపైకి రాకుండా ఉండే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం తప్పని పరిస్థితులు, అకాల వర్షాల వస్తే నష్టం కలుగుతుందనే భయంతో ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నాం. ఈజీఎస్‌లో ఇప్పటికి కూడా అవకాశం ఉంటే కల్లాలు ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

– దూళ్ల ఎర్రన్న, రైతు, రాయపల్లి


రంగారెడ్డిగూడ శివారులో..


రైల్వేస్టేషన్‌రోడ్డులో ఆరబోసిన వరిధాన్యం

మూఢనమ్మకాల నిర్మూలన కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్ : మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశానికి ఎన్నికల పరిశీలకులుగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రాముయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోతున్న గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికి మూఢ నమ్మకాలు పోలేదని, వాటిని పూర్తిగా నిర్మూలించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం కమిటీ జిల్లా అధ్యక్షుడిగా చిన్ని కృష్ణ, ఉపాధ్యక్షుడిగా సందుల రాజు, రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌చక్రవర్తి, సహాయ కార్యదర్శులుగా తిరుపతి, కనకప్ప, బాలరాజు, భీములను ఎన్నుకున్నారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.